
ప్రజాశక్తి
ఆదివారం 27 అక్టోబర్ 2024 5 అనంతపురం



‘అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తాం.. ప్రజలపై ఈ ప్రభుత్వం వేసిన భారాలను అన్నీ తగ్గించి అండగా ఉంటాం’ అంటూ ఎన్నికల ముందుకు కూటమి నాయకులు ఇచ్చిన హామీ నీటిమూట అయ్యింది. ట్రూ అప్ పేరుతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై భారం వేసింది. అధికారంలోకి వచ్చిన మూన్నెళ్లకే విద్యుత్ ఛార్జీల పెంచి సామాన్య, మధ్య తరగతి కుటుంబాల నడ్డివిరిచింది. ఇప్పటికే పెరిగిన ధరలతో సతమతం అవుతున్న ప్రజలకు విద్యుత్ ఛార్జీల భారం మూలిగే నక్కపై తాటికాయపడ్డ చందంగా తయారైంది. విద్యుత్ ఛార్జీలను పెంచుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రజల నుంచి సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది.



ప్రజలకు కూటమి షాక్

- ట్రూ అప్ పేరుతో విద్యుత్‌ఛార్జీల భారం
- యూనిట్‌పై రూ.1.58 వరకు అదనం
- గత ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తున్న కూటమి
- ప్రభుత్వ తీరుపై విద్యుత్ వినియోగదారుల మండిపాటు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యుత్ పంపిణీ సంస్థలు వాటికయ్యే ఖర్చు, వస్తున్న ఆదాయం మధ్యనున్న వ్యత్యాసాన్ని పూడ్చుకునేందుకు అంటూ ట్రూఅప్ పేరుతో అదనపు ఛార్జీలను వసూలు చేస్తోంది. గత ప్రభుత్వం ఇదే విధానాలను అవలంభించింది. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి వీటిపై పెద్ద ఎత్తున విమర్శలు చేసింది. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని హామీలు సైతం ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే ఆ హామీని తుంగలో తొక్కి ట్రూ అప్ పేరుతో పేదలపై భారం వేసింది. అనంతపురం జిల్లాలో 12.99 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో హెచ్‌టి సర్వీసులు (భారీ పరిశ్రమలు) 817 ఉన్నాయి. వీటి పరిధిలో గృహ వినియోగారులకు సంబంధించి ప్రస్తుతం ట్రూ అప్ పేరుతో విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రభుత్వం ప్రజలపై వేసింది. ప్రస్తుతం యూనిట్‌కు రూ.1.58 పైసలు ప్రజలపై భారం పడనుంది. ప్రస్తుత నిబంధన ప్రకారం దాదాపు 18 నెలల పాటు దీనిని వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నారు. ఉదాహరణకు నెలకు 30 యూనిట్లకన్నా తక్కువగా వాడేవారు ఇప్పుడు యూనిట్‌కు రూ.1.90 పైసల చొప్పున చెల్లిస్తుండగా ఇకపై రూ.2.73 పైసల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి వారిపై దాదాపు 44 శాతం అదనపు విద్యుత్ భారం పడనుంది.

ప్రజల మండిపాటు

విద్యుత్ ఛార్జీల పెంపుపై ప్రజల నుంచి సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పి ఇప్పుడు ట్రు అప్ భారాలు వేయడం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీల నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలంటూ ఇప్పటికే సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళనలు చేపట్టి నిరసన తెలిపారు. భవిష్యత్తులో కూడా వీటిపై ప్రజలతో కలిసి పోరాటం చేస్తామంటూ ఆ పార్టీ తెలియజేసింది. ఇప్పటికే ధరాభారాలతో సతమతం అవుతుంటే ప్రభుత్వం ట్రూ అప్ పేరుతో విద్యుత్ ఛార్జీల రూపంలో మరో భారాన్ని మోపడంపై సామాన్యుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసహరించుకోవానే డిమాండ్ ప్రజలందరి నుంచి వ్యక్తం అవుతోంది.

విద్యుత్ ఛార్జీల భారాన్ని వెంటనే ఉపసంహరించాలి

వి.రాంభకూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ.6,072 కోట్ల భారాన్ని విధిస్తూ ఎపి విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఇచ్చిన ఉత్తర్వును వెంటనే ఉపసంహరించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ధరల పెరుగుదల, మరోవైపున ఉపాధి లేక ఆదాయాలు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ఇలా విద్యుత్ భారం మోపడం అమానుషమన్నారు. ఏనాడో వాడిన కరెంటుకు ఏళ్లు గడిచిపోయాక అదనంగా ఛార్జీలు చెల్లించాలన్న ఈఎఫ్‌పిపిసిఎ (ట్రూఅప్) విధానం మోసపూరితమైనదన్నారు. ప్రపంచ బ్యాంకు ఆదేశిత విద్యుత్ సంస్కరణల్లోని దుర్మార్గమైన షరతుల్లో ఇది ముఖ్యమైనదని చెప్పారు. 2022-23లో వాడిన కరెంటుకు ఈ నవంబర్ నెల నుంచి 2026 జనవరి వరకు కొన్ని నెలల్లో యూనిట్‌కు దాదాపు 83 పైసల వరకూ అదనంగా చెల్లించాలని తాజా ఉత్తర్వు ఇవ్వడం విద్యుత్ వినియోగదార్లందరిపై భారం వేయడమే అన్నారు. అధికారంలోకి వస్తే ‘విద్యుత్ ఛార్జీలు నియంత్రిస్తాం... ‘విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తాం.. అని ఉమ్మడి మేనిఫెస్టోలో హామీలిచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం తగ్గించడం సంగతలా ఉంచి ఇప్పుడు అమాంతం 44 శాతం పెంపుదలకు పూనుకోవడం దారుణ అన్నారు. షార్ట్‌టర్మ్ కొనుగోళ్ల పేరుతో గత ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాన్ని ఈ ప్రభుత్వం కొనసాగించడం గర్హనీయ అన్నారు. మాటతప్పి ప్రజలపై వేసిన ట్రూఅప్ చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రమాదంలో మృతి చెందిన వారు



ప్రణవ్‌సాయి రెడ్డి



ప్రసన్నకుమార్ రెడ్డి



సంతోష్ కుమార్



బొట్ట షణ్ముఖ



బలగొండ శ్రీనివాసులు



వెంకటేశులు



ఘటనా స్థలంలో లారీ కిందకు దూసుకుపోయిన కారు

మృత్యు ‘సంకీర్తన’

సంకీర్తనలు విన్పిస్తూ అందులో నిత్యం ఊలలాడే వారిని మృత్యువు వెంటాడింది. ఎంతో సంతోషంగా సంకీర్తనలు చేసి తిరిగొస్తున్న వారికి అదే చివరి ప్రయాణం అయ్యింది. రాత్రంతా కీర్తనలు పాడి అలసిపోయి కారులో కునుకు తీసిన వారు అలాగే మృత్యునిద్రలోకి జారుకున్నారు. అనుకోని ప్రమాదంతో వారి జీవితాలు అర్థాంతరంగా ముగిశాయి. శనివారం సాయంత్రం అనంతపురం జిల్లా నాయనపల్లి క్రాస్ వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. మరణించిన వారంతా అనంతపురం జిల్లా కేంద్రంలోని ఇస్కాన్ టెంపుల్‌కు సంబంధించిన సభ్యులు. తాడిపత్రిలో సంకీర్తనలు ముగించిన అనంతపురానికి కారులో తిరిగొస్తుండగా నాయనపల్లి క్రాస్ వద్ద ఈ ఘటన చోటు శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...

- నాయనపల్లిక్రాస్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- లారీని ఢీకొన్న కారు
- ఆరుగురు దుర్మరణం
- మృతులంతా అనంత ఇస్కాన్ సభ్యులు
- తాడిపత్రిలో సంకీర్తనలు ముగించుకుని వస్తుండగా ఘటన

ప్రజాశక్తి-శింగనమల, అనంతపురం కలెక్టరేట్

అనంతపురం ఇస్కాన్ ఆలయంలో అనంతపురానికి చెందిన మందల సంతోష్ కుమార్(34), గిల్లి వెంకటేష్ (20), యాగంటి లక్ష్మి ప్రసన్నకుమార్ రెడ్డి (29), కర్న ప్రణీత్ ప్రణవ్‌సాయి రెడ్డి (14), శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం హరియాన్ చెరువు గ్రామానికి చెందిన బలగొండ శ్రీనివాసులు(34), శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పెద్దపల్లికి చెందిన బొట్ట షన్ముఖ(21)లు ఉన్నారు. వీరు ఇస్కాన్ ఆలయంలో భక్తులుగా ఉంటూ వివిధ ప్రాంతాల్లోని ఆలయాల్లో సంకీర్తనలు చేసేందుకు వెళు తుంటారు. అందులో భాగంగా శుక్రవారం సాయంత్రం అనంతపురం జిల్లా తాడిపత్రిలోని ఓ ఆలయంలో సంకీర్తనలు చేసేందుకు వెళ్లారు. అక్కడ సంకర్తీనలు చేసి ఆరోజు రాత్రి అక్కడే ఉన్నారు. శనివారం మధ్యాహ్నం కారులో తాడిపత్రి నుంచి అనంతపురంలో ఆరుగురు బయల్దేరారు. కారు శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ వద్దకు రాగానే టైర్ పేలింది. దీంతో అదుపు తప్పి ఎదురుగా అనంతపురం నుంచి బియ్యం లోడుతో వెళ్తున్న లారీని ఢీకొంది. లారీ, కారు వేగంగా ఎదురెదురుగా ఢీకొనడంతో కారులో ఉన్న ఆరుగురూ అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటనతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. లారీ కిందకు కారు దూసుకుపోవడంతో నుజ్జునుజ్జు అయ్యింది. అందులో ఆరుగురూ ఇరుక్కుపోయారు. అటుగా వెళ్తున్న వారు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లారీ కింద ఇరుక్కుపోయిన కారును అతికష్టం మీద బయటకు తీశారు. కారు తలుపులను బలవంతంగా తెరిచారు. అప్పటికే కారులో ఉన్న ఆరుగురూ తీవ్ర గాయాలతో మరణించారు. మరణించిన వారి వద్ద ఉన్న గుర్తింపు కార్డుల ఆధారంగా వారంతా అనంతపురం ఇస్కాన్ ఆలయానికి సంబంధించిన వారుగా గుర్తించారు. వెంటనే ఇస్కాన్ నిర్వాహకులకు సమాచారం అందించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు శింగనమల సిఐ కౌరుట్లయ్య తెలిపారు.

ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

నాయనపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఓ ప్రకటన విడదల చేశారు. సంకీర్తనలకు వెళ్లి తిరిగివస్తుండగా ప్రమాదంలో అరుగురు మరణించడం విచాకరం అన్నారు. మతుల బంధువులకు ఎమ్మెల్యే ఫోన్ చేసి మాట్లాడి సానుభూతినీ వ్యక్తం చేశారు.

కూలీలతో వెళ్తున్న కారు, ఆటో ఢీ

ఒకరు మృతి.. 10 మందికి గాయాలు

ప్రజాశక్తి-యాడికి

కూలీలతో వెళ్తున్న ఓ ఆటోను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా 10 మంది కూలీలు గాయపడ్డారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... యాడికి మండలం కొట్టాలపల్లి నుంచి వేరుశనగ కట్టెను తొలగించడానికి డీజిల్ ఆటోలో 12 మంది కూలీలు బయల్దేరారు. ఆటో వేమలపాడు ప్రధాన రహదారిపైకి వెళ్లగానే తాడిపత్రి నుంచి గుత్తికి వెళ్తున్న ఓ కారు ఢీకొంది. ఆటో పల్టీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న వారంతా గాయపడ్డారు. అటుగా వెళ్తున్న స్థానికులు స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొట్టాలపల్లి గ్రామానికి చెందిన దస్తగిరమ్మ(52)ను చికిత్స నిమిత్తం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించింది. మిగిలిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలాన్ని యాడికి పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో గాయపడిన కూలీలు


కూలీలకు మెరుగైన వైద్యం అందించాలి : వ్యకాసం

యాడికి మండలంలోని వేములపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కూలీలందరికీ ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. కూలీలకు సొంత గ్రామాల్లో పనుల్లేక కుటుంబ పోషణ నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారని చెప్పారు. ఇలాంటి సందర్భాల్లోనే రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారని చెప్పారు. స్థానికంగా గ్రామాల్లో పనులు కల్పిస్తే కూలీలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రతి గ్రామంలోనూ 200 రోజుల ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రమాదాల దారి..!

అనంతపురం-తాడిపత్రి జాతీయ రహదారిలో వరుస ఘటనలు

అనంతపురం-తాడిపత్రి జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ప్రస్తుతం నాయనపల్లి క్రాస్ వద్ద ఆరుగురు మృతి చెందిన ఈ ఘటన ఈ వారంలో ఇది రెండవ ప్రమాదం. నాలుగు రోజుల క్రితం ఇదే రహదారిపై ఓ రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని ఇద్దరు రైతులు మరణించారు. ప్రమాదాలకు నిలయంగా ఈ దారి మారిందంటూ వాహనారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



పనులు జరుగుతున్న తాడిపత్రి అనంతపురం జాతీయ రహదారి

ప్రజాశక్తి-శింగనమల

అనంతపురం నుంచి తాడిపత్రి వైపు నాలుగు లైన్లుగా ఉన్న 544-డి రహదారిని ఆరులైన్లుగా పునరుద్ధరిస్తున్నారు. ప్రస్తుతం అనంతపురం సమీపంలోని పామురాయి నుంచి తాడిపత్రి వరకు ఆరు అడుగుల జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. పనులు చేసే చోట కనీస ప్రమాద సూచికలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం నుంచి రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రహదారి పనుల్లో భాగంగా ప్రతి గ్రామం వద్ద బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు. ఆయా బ్రిడ్జిలు నిర్మించే ప్రదేశాల్లో రోడ్డు పక్కనే దారి నిర్మిస్తున్నారు. ఆ దారిని కేవలం కంకరతో వేస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పనులు చేసే చోట రేగుతున్న దుమ్మూధూళితో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించని పరిస్థితి ఉంది. దీనికితోడు రోడ్డు డైవర్షన్ల వద్ద కనీస ప్రమాద సూచికలు ఏర్పాటు చేయడం లేదు. రోడ్డు పనులు ప్రారంభమైనప్పటి నుంచి తాడిపత్రి వరకూ అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా శింగనమల మండల సమీపంలో ఎక్కువగా ప్రమాదాలు జరిగాయి. ఇటీవల శింగనమల మండలం బండమీదపల్లి సమీపంలో కంకర కుప్పను ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఆయన కూతురు తీవ్రంగా గాయపడింది. నాలుగు రోజుల క్రితం ఇదే మండలం సమీపంలోని పోతురాజుకాలువ వద్ద టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు రైతులు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన మరువకముందే నాయనపల్లి క్రాస్ వద్ద శనివారం సాయంత్రం కారు, లారీ ఢీకొనడంతో ఆరుగురు చనిపోయారు. ఇలా దారిలో నిత్యం ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు పోతూనే ఉన్నాయి. వరుస ఘటనలతో సమీప గ్రామాల ప్రజలు ఉలికిపాటుకు గురవుతున్నారు. ఈ దారి వెంట ప్రయాణించాలంటనే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్డు పనులు చేసే చోట చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నివారించే అవకాశం ఉన్నా సంబంధిత అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా బ్రిడ్జిల వద్ద తారు రోడ్డు వేసిన తర్వాత వాహనాలకు అనుమతి ఇస్తే ప్రమాదాలు జరగవు. మట్టి రోడ్డు వేయడం వల్ల చిన్న, చిన్న గుంతలు ఏర్పడుతుండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జాతీయ రహదారి పనులు చేసేచోట కనీస జాగ్రత్తలు తీసుకునేలా ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహాశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని తహాశీల్దార్ కార్యాలయం ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ, ఇంజినీరింగ్, బి-ఫార్మసీ వంటి ఉన్నత విద్యలో పెండింగ్‌లో ఉన్న రూ.3480కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆ నిధులు విడుదల చేయకనే 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి 1, 3, 5వ సెమిస్టర్లకు పరీక్ష ఫీజులు కట్టాలని విద్యార్థులపై ఒత్తిళ్లు తెస్తున్నారన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నవంబర్ 6న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, జిల్లా సహాయ భీమేష్, అరవింద్, ధనుష్, ఆదర్శ్, నరసింహా, జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి బాధితులకు న్యాయం చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూ్న సూచించారు. శనివారం కళ్యాణదుర్గం ఆర్‌డిఒ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డివిజినల్ స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను సభ్యులు పరిశీలించి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విధిగా ప్రతి మూడు నెలలకోసారి సమావేశం నిర్వహించి నిర్ధిష్ట కార్యాచరణ ప్రణాళికకు రూపకల్పన చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక రకాల సంక్షేమ పథకాలను ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు వర్తింపజేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు ఉండడం తగదన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే తమ దృష్టికి తీసుస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా బొమ్మనహాల్, కంబదూరు మండలాల్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. ఇందుకు కారణమయ్యే వారిని ముందస్తుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజినల్ స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు ఇఎం.మోహన్, హెచ్.రామాంజనేయులు, కళ్యాణదుర్గం ఎంపిపి హెచ్.మారుతమ్మ, కంబదూరు జడ్పిటిసి జి.నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

నిధుల కేటాయింపు ముఖ్యం

- సాగునీటి ప్రాజెక్టులపై పాలకులు స్పందించాలి
- బృందంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్దాం
- సిపిఎం చర్చావేదికలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అత్యంత కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లాకు సాగునీటి వనరుల అభివృద్ధికి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని వక్తలు డిమాండ్ చేశారు. ఇక్కడి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సమిష్టిగా ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలోని ఎన్జీవో హోంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సాగునీటి ప్రాజెక్టులపై మేధావులు, ప్రజా సంఘాల నాయకులతో చర్చా వేదిక కార్యక్రమం శనివారం నాడు నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప అధ్యక్షతన జరిగిన ఈ చర్చావేదిక జరిగింది. జిల్లా సాగునీటి నిపుణులు ఎస్.ఎం.బాషా మాట్లాడుతూ అత్యంత కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లా సాగునీటి వనరుల పరిరక్షణపైనా పాలకులకు ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. వీటిపై కదలిక రావాలంటే విశాల ఐక్య ఉద్యమాన్ని రూపొందించాల్సిన అవసరముందని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి జరగాలంటే ప్రధానమైనది నీటి వనరులను అందించడమని పేర్కొన్నారు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరించడం, హంద్రీనీవాను వెడల్పు చేయడం అత్యంత ప్రాధాన్యమైనవని తెలిపారు.మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో ఆర్థిక మంత్రిగానున్న పయ్యావుల కేశవ్‌కు ఇక్కడి సాగునీటి సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉందని చెప్పారు. కనీసం ఆయన నియోజకవర్గంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసమైనా కృషి చేయాలని ఒత్తిడి చేయాల్సిన అవసరముందని సూచించారు. సామాజికవేత్త బోస్ మాట్లాడుతూ ప్రాజెక్టుల వారీగా కార్యక్రమాలను రూపొందించి, జనసమీకరణ కూడా ఆయా ప్రాజెక్టుల వారీగానే చేపట్టి కదలిక తీసుకురావాలని సూచించారు. మానవ హక్కుల వేదిక నాయకులు అబ్దుల్ రసూల్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న సాగునీటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా ప్రయత్నించాలని తెలిపారు. అవసరమైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కలసి జిల్లా తరుపున వినతిపత్రాన్ని అందివ్వాలని తెలిపారు.



చర్చావేదికలో మాట్లాడుతున్న రాంభూపాల్

తీర్మానాలు

1. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణను తక్షణం చేపట్టి పూర్తి చేయాలి, నవంబర్ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.
2. తుంగభద్ర డ్యామ్ గేట్లు పూర్తిగా దెబ్బతిన్నాయని నిపుణులు సూచించిన నేపథ్యంలో కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలను కలుపుకుని నిధులు కేటాయించి డ్యామ్ గేట్లను కొత్తవి ఏర్పాటు చేయాలి.
3. హంద్రీనీవాను 6500 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి పెంచాలి.
4. చెరువులు, కుంటల స్థితిగతులపై సమగ్రమైన ప్రణాళిక రూపొందించి. నిర్ధిష్ట కాలపరిమితిలోపు పునరుద్ధరించాలి.
5. ఉంతకల్లు జలాశయం పూర్తి చేయాలి.
6. పిఎబిఆర్ కుడికాలువకు నీరివ్వాలి.
7. సుబ్బరాయసాగర్‌కు నీటిని విడుదల చేయాలి.

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 15వ నుంచి 19వ తేదీ వరకు సాగునీటి కోసం సిపిఎం ఆధ్వర్యంలో బస్సుయాత్ర చేపట్టామన్నారు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, హంద్రీనీవా కాలువలు ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యకాసం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రి, సిపిఎం నగర కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, రామిరెడ్డి, సిఐటియు నాయకులు నాగమణి, మానవతా రక్తదాతల సంస్థ ప్రతినిధి తరిమెల అమర్‌నాథరెడ్డి, సీనియర్ నాయకులు వికె.రంగారెడ్డి, రిటైర్డు రెవెన్యూ అధికారి గోవిందరాజులు, ఓబులేసు, జర్నలిస్టు భోగేశ్వరరెడ్డి, నాయకులు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కార్యచరణ

పై నిర్ధిష్టమైన సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే విధంగా కార్యచరణను రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. మొదట సమస్యను జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్‌కు విన్నవించాలని నిర్ణయించారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలసి ఇక్కడి సమస్యలను వివరించేందుకు ఒక బృందం రాజధానికెళ్లి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు. వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోతే కలిసొచ్చే అందరితోనూ పార్టీలకు అతీతంగా విశాల ఐక్యవేదికను ఏర్పాటు చేసి ఉద్యమం చేపట్టాలని తెలిపారు.

విద్యుత్‌ఛార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలి

సిపిఎం ఆధ్వర్యంలో వినతులు

ప్రజాశక్తి-శింగనమల


ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాన్ని వెంటనే ఉపసరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని కల్లుమడి గ్రామంలో సచివాలయ అధికారులకు సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ.6,072 కోట్ల భారం వేయడానికి పూనుకోవడం మంచిది కాదన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచడం వల్ల ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతోపాటు విద్య, వైద్యం ఖర్చులు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. కావున వెంటనే విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మునియప్ప, కేసన్న, నల్లప్ప, వెంకట్రాముడు, కొండారెడ్డి, జయరాముడు, శ్రీనివాసులు, ఆంజనేయులు, రామాంజనేయులు, ఎర్రిస్వామి, ఓబిరెడ్డి, సూర్యప్రకాష్, వెంకటస్వామి, ధన, ఆంజనేయులు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఎఫ్‌పిపిసిఎ చార్జీల పేరిట ప్రజలపై రూ. 6,072 కోట్ల భారాన్ని విధిస్తూ ఎపి విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ నేడిచ్చిన ఉత్తర్వును వెంటనే ఉపసంహరించాలని సిపిఎం ఉరవకొండ ఆర్గనైజింగ్ మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు సిపిఎం ఆధ్వర్యంలో ఉరవకొండ, కూడేరు మండలాల్లో ధర్నాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సీనప్ప, సిద్ధప్ప, వెంకటేసులు, మురళి, కూడేరు సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశులు, నాయకులు ఎస్.కరీంసాబ్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరిట రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారం మోపకూడదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్ శ్రీనివాసులు నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక భారాలు మోపడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం వెంటనే పెంచిన విద్యుత్ ఛార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ, సిపిఎం కార్యకర్తలు కృష్ణానాయక్, తిమ్మరాజు, మధు, ఆంజనేయులు, ఉమేష్, చిత్తయ్య, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : ఇంధన సర్దుబాటు పేరుతో ప్రజలపై విద్యుత్రా భాన్ని వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఇన్‌ఛార్జి ఆర్‌డిఓవినూత్నకు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన సర్దుబాటు పేరుతో ప్రజలపై వేస్తున్న విద్యుత్ భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలపై రూ.6072 కోట్ల భారం వేయడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. వెంటనే విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

గుంతకల్లు : ప్రజలపై విద్యుత్ ట్రూ అప్ చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆలూరు రోడ్డులోని విద్యుత్ శాఖ కార్యాలయంలో డిఎఇ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో ట్రూ అప్ ఛార్జీల పేర ప్రజలపై రూ.6,072 కోట్ల భారాన్ని విధిస్తూ ఎపి విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళనలను చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కసాపురం రమేష్, జగ్గలి రమేష్, పట్టణ కమిటీ సభ్యులు చంద్ర, సురేంద్ర, చొక్కా సునీల్‌కుమార్, ఓబులేసు, రామునాయక్, షాషా, సూరి, తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు



శింగనమల మండలం నిదనవాడలో వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి

గుత్తి : మున్సిపల్ పారి శుధ్య కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు అనుబంధ సంస్థ ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్య నారాయణ, ఎన్.రామాం జనేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం స్థానిక కార్యాలయంలో కమిషనర్ బి.జబ్బార్‌మియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల పిఎఫ్, ఈఎస్ఐ సమస్యలను పరిష్కరించాలన్నారు. పనిముట్లు ఇవ్వాలన్నారు. చనిపోయిన కార్మిక కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలన్నారు. మున్సిపాలిటీ జనాభాకు సరిపడా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.ఓబులేష్, టి.సుంకన్న,కె.బాల రంగన్న, బేడల నాగేంద్ర, ఈశ్వరయ్య, కె.రాజశేఖర్, రత్నాలు, శ్రీనివాసులు, వి.వినయ్ పాల్గొన్నారు.



కమిషనర్‌కువినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

జాతీయస్థాయిలో గేట్స్ విద్యార్థుల ప్రతిభ

గుత్తి : జాతీయస్థాయి సాంకేతిక సదస్సులో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కర్నూలులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జిగ్నాస 2కె 24 జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు నిర్వహించారు. సదస్సులో 50 కళాశాలల విద్యార్థులు పాల్గొనగా గేట్స్‌లో ఇంజినీరింగ్ ఇసిఇ, సిఎస్ఇ, సిఎఐ చదువుతున్న విద్యార్థులు తిలక్, సాయి రేవంత్, రోహిత్ కుమార్, మౌనిక, సాయికుమార్, అఖిల, అనిల్ కుమార్, బషీర్ బాబు పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. పేపర్ ప్రజెంటేషన్‌లో మూడవ బహుమతి, పోస్టర్ ప్రదర్శనలో రెండవ బహుమతి, ప్రోటోటైప్ డెవలప్‌మెంట్‌లో మూడవ బహుమతిని సాధించారు. ఈమేరకు కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎండి రఘునాథ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ప్రయత్నాలు వారి నిబద్ధతను ప్రతిబింబిస్తాయాన్నారు. ఈ విజయానికి దోహదపడ్డాయాన్నారు అనంతరం గెలుపొందిన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి,ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ అభినందించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇంతియాజ్ భాష, విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో గేట్స్ కళాశాల యాజమాన్యం

ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న

ఈశ్వరయ్యపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని ఐటిఐ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ఈశ్వరయ్యను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు గణేష్, సోమ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం స్థానిక ఐటిఐ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఫిట్టర్ కోర్స్ బాధ్యత చూస్తున్న ఈశ్వరయ్య విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఈశ్వరయ్య సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వీరు, సాయి, విజయ్, రాజేష్, స్వామి, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఐటిఐ కళాశాల వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

భోజనప్రియులకు 'స్పైస్ గార్డెన్'లో పసందైన విందు

అధినేత సి.బాబురావు

ప్రజాశక్తి-అనంతపురం

సుచి, శుభ్రతతో రుచికరమైన వంటకాలకు వేదికగా స్పైస్ గార్డెన్ ఫ్యామిలీ రెస్టారెంట్ నిలుస్తోందని రెస్టారెంట్ అధినేత సి.బాబురావు తెలిపారు. బెంగళూరు హైవేలో కియా మహేంద్ర షోరూమ్ పక్కన ఉన్న స్పైస్ గార్డెన్ రెస్టారెంట్ అందరికీ అనుకూలంగా ఉంది. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ గత 15ఏళ్లుగా ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు స్పైస్ గార్డెన్ సేవలు అందిస్తోందన్నారు. వెజ్, నాన్‌వెజ్ కలిపి సుమారు 300 రకాలకుపైగా వంటకాలను అందిస్తున్నట్లు వివరించారు. 70 మందికిపైగా ఒకేసారి కూర్చునేందుకు వీలుగా స్పైస్ గార్డెన్ రెస్టారెంట్ ఆధునిక హక్కులతో ఆహ్వానం పలుకుతుందన్నారు. ప్రధానంగా ఇండియన్ చైనీస్, తందూరి, కుండ బిర్యాని, చిట్టి ముత్యాలు, బిర్యానీ, పన్నీరు, దాల్ ఫ్రై, పన్నీర్ రైస్, ముఖ్యంగా ముద్ద, నాటుకోడి వంటి వంటకాలను రుచికరంగా అందిస్తున్నామన్నారు. నిష్ణాతులైన మాస్టర్లతో వంటలు స్పైసీగా ఉండే విధంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఫంక్షన్లకు అన్ని రకాల వేడుకలకు నాన్‌వెజ్ క్యాటరింగ్ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. స్పైస్ గార్డెన్ రెస్టారెంట్ అందిస్తున్న నాణ్యమైన రుచికరమైన వంటకాలను ప్రజలు ఆదరిస్తున్నారన్నారు.





'స్పైస్ గార్డెన్' రెస్టారెంట్, అధినేత సి.బాబురావు

ఎస్ఆర్ఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు జాతీయ అవార్డు

శింగనమల : బుక్కరాయసముద్రం మండల పరిధిలోని రోటరీపురం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటి కళాశాలలో సిఎస్ఇ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న నగేష్ 'పాన్ ఇండియా ఐకానిక్ ఉపాధ్యాయ అవార్డు'ను అందుకున్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ఉన్న ప్రయివేటు పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో బోధిస్తున్న టీచర్లు, లెక్చరర్లు, ప్రొఫెసర్లకు ప్రతిఏటా అవార్డులను అందజేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈఏడాది గుంటూరులోని కెన్నడి నెక్స్ జనరేషన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వమించిన అవార్డుల ప్రదానోత్సవంలో నగేష్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఐటి కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు నగేష్‌కు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న నగేష్

ఆత్మకూరులో డ్వామా పీడీ పర్యటన

ఆత్మకూరు : డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా శనివారం మండలంలో ఆకస్మిక పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకం కింద మండలంలో చేపట్టిన వివిధ పనులను పరిశీలించారు. ముందుగా ఒడ్డుపల్లి కెనాల్ వద్ద కంపచెట్లను తొలగించి మామిడి మొక్కలు నాటారు. అక్కడి నుంచి మండల కేంద్రానికి చేరుకుని సిమెంట్ రోడ్డు, పశువుల షెడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రూ.2.50కోట్ల సిమెంటు రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. మరో రూ.2.50కోట్లతో ఇతర పనులు సాగుతున్నాయన్నారు. ఆయా పనులను నాణ్యతగా డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.లక్ష్మీనరసింహ, ఇసి భాస్కర్, టిఎలు పుష్పాంజలి, నాగార్జున, ప్రతాప్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎర్రిస్వామి, బొమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్

ప్రజాశక్తి-గుంతకల్లు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాదిమంది నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కేక్ కోసి పూలమాలలు, శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కట్టుబడి పని చేస్తున్నారన్నారు. కావున ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా ప్రతి ఒక్కరూ పార్టీ కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్ పవన్ కుమార్ గౌడ్,నాయకులు కేశప్ప,మస్తాన్ యాదవ్,కురుబ చంద్రశేఖర్, ముక్కన్న గారి రామాంజినేయులు, ధర్మతేజ్ గౌడ్, బండి లక్ష్మీదేవి, జయమ్మ, కురుబ శివన్న, క్లస్టర్ల ఇన్‌ఛార్జిలు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్‌ను సత్కరిస్తున్న నాయకులు



రోడ్డును పరిశీలిస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

రోడ్డు విస్తరణ పనులు పరిశీలన

పామిడి : పట్టణంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు ఈశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. త్వరలోనే రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఇఒ గోపాల్, టిడిపి నాయకులు కత్రిమల ప్రభాకర్‌చౌదరి, ఆర్‌ఆర్.రమేష్, లంగాల గౌస్, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, జింకల సంజీవకుమార్, ముసలిరెడ్డి, బొమ్మా మోహన్, కరూరు శివశంకర్, జనసేన ధను, అనుంపల్లి మహేష్, సోషల్ మీడియా శివ, అనుంపల్లి శీన, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

కళ్యాణదుర్గం రూరల్ : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం పట్టణంలోని ముదిగల్లు రోడ్డులో ఉన్న లిటిల్ రోజెస్ పాఠశాలలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు లయన్స్ క్లబ్ కంబాల తిమ్మారెడ్డి తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించాలి

అనంతపురం : జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని కుష్టు వ్యాధి విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ సూచించారు. శనివారం నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లాలోని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లతో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కేసునూ తొలిదశలోనే గుర్తించడం వల్ల అంగవైకల్యం నుంచి రక్షించవచ్చన్నారు. కొత్త కేసు వచ్చిన చోట ఫోకల్ సర్వే నిర్వహించాలన్నారు. అలాగే కుష్టువ్యాధిని గురించి ప్రజలకు ఉన్న అనుమానాలు, అపోహలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా కుష్టువ్యాధి అతి సాధారణమైందన్నారు. కుష్టువ్యాధి ఏ దశలో ఉన్నా ఆరు లేదా 12 నెలలు బహుళ ఔషధ చికిత్సతో నయం అవుతుందన్నారు. అలాగే అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు ఉచితంగా లభిస్తాయన్నారు. ఈ సమావేశంలో సిబ్బంది గంగాధర్‌రెడ్డి, పారామెడికల్. అధికారి నాగన్న, హెచ్ఇఒ సత్యనారాయణ, రాముడు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుష్టువ్యాధి విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్

క్రీడా దుస్తులు పంపిణీ

అనంతపురం : జెఎన్‌టియు క్రికెట్ జట్టుకు క్రీబీస్ వారు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈమేరకు జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి ఆధ్వర్యంలో క్రిబీస్ వారు ఎం.అంకారావు, జె.శ్రీనివాసులు, రామాంజినేయులు, శివశంకర్, మల్లికార్జునరెడ్డి, మన్మథరెడ్డి, సిద్ధూ, భరత్‌సాయి, తదితరులు 15 మంది క్రీడాకారులకు టీ షర్టులు, ప్యాంట్లు, క్రికెట్ కిట్లు అందజేశారు.



క్రీడాదుస్తులు అందజేస్తున్న క్రీబీస్ సభ్యులు

సర్వసభ్య సమావేశంలో సమస్యలు ఏకరువు

బొమ్మనహాళ్ : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు సమస్యలపై ఏకరువు పెట్టారు. ముందుగా పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు నివేదికలు తయారు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ప్రధాన రహదారి వేదావతి నదిలో 100 మీటర్ల పొడవు కోతకు గురైందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. రూ.2కోట్లతో నిర్మించిన డి.వన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి ప్రారంభించాలని సర్పంచి శకుంతల సభ దృష్టికి తీసుకొచ్చారు. వీటితోపాటు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ మునివేలు, ఎంపిడిఒ దాసానాయక్, పంచాయతీరాజ్ శాఖ జెఇ జగదీష్, పశువైద్యాధికారి వెంకటరెడ్డి, ఎంపిటిసి తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు సిఎస్‌డిటిగా రాజా

యల్లనూరు : మండల సిఎస్‌డిటిగా రాజా శనివారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు

పుట్లూరు : మండలంలో బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హేమాద్రి శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మండలవ్యాప్తంగా గ్రామాల్లో ఎక్కడా బెల్టుషాపులు నిర్వహించరాదన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

'క్యాట్' ఫలితాల్లో 'శ్రీచైతన్య' విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి-అనంతపురం

క్యాట్ మొదటి లెవెల్ పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు విజయదుందుభి మోగించినట్లు విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం నగరంలోని కమ్మభవన్ సమీపంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్‌లో నిర్వహించిన క్యాట్ మొదటి రౌండ్ పరీక్షలకు ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా శ్రీచైతన్య విద్యాసంస్థల నుంచి 4250 మంది విద్యార్థులు హాజరు కాగా 1700 మంది విద్యార్థులు రెండవ లెవెల్‌కు అర్హత సాధించి రాష్ట్రస్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపారన్నారు. అంకుటిత దీక్ష, కృషి, పట్టుదల, నాణ్యమైన మెటీరియల్ అందించడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు విశ్వనాథ్, సమీనా ఖాన్, తబస్సుం, వెంకటేష్, సతీష్, మురళి, పర్వీన్‌భాను, నేత్రావతి, శాంత, శ్రీదేవి, కరీం, కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, తిరుమలేశు, నాగభూషణం, ఇర్షాద్, డీన్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో 'శ్రీచైతన్య' పాఠశాల యాజమాన్యం

జీవాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బుక్కరాయసముద్రం : పశువుల్లో వచ్చే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వెంకటేశ్వర పశు వైద్య సంచాలకులు డాక్టర్ సిహెచ్.లత సూచించారు. శనివారం మండల పరిధిలోని సిద్దలాపురం వద్ద ఉన్న పరిశోధన క్షేత్రంలో ఉన్న పథాలజీ, సైకాలజీ ల్యాబ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాబ్ ద్వారా జీవాల్లో వచ్చే వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేయవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హెచ్.శ్రీనివాస్‌నాయక్, సీనియర్ సైంటిస్ట్ హెడ్ డాక్టర్ సి.చేతన్‌కుమార్, సైంటిస్ట్ డాక్టర్ బి.రఘు కరణ్, తదితరులు పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

పాలకుల శాపం..!



అనంత వీక్షణం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్న చందంగా మారింది. అనంతపురం జిల్లా పరిస్థితి. ఒకవైపు ప్రధాన ప్రాజెక్టులన్నీ నాలుగైదుసార్లు నిండి పొర్లుతున్నా అనంతపురం జిల్లాలోని ప్రాజెక్టుల్లో మాత్రం నీరు అంతంత మాత్రంగానే ఉండటం గమనార్హం. ఆగస్టు, అక్టోబర్ మాసాల్లో పడిన వర్షాన్ని కూడా ఒడిసి పట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి పాలకుల శాపమే కారణమన్న విమర్శలున్నాయి. సాగు,తాగునీటిని అందించే రెండు ప్రాజెక్టులు జిల్లాకు ఉన్నాయి. అటు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, రెండు హంద్రీనీవా. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు తుంగభద్ర డ్యామ్ నుంచి నీళ్లు వస్తుండగా, హంద్రీనీవాకు శ్రీశైలం డ్యామ్ నుంచి వస్తాయి. తుంగభద్ర డ్యామ్ గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి నీళ్లొచ్చాయి. ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు తుంగభద్ర డ్యామ్‌కు వచ్చిన నీళ్లు 451 టిఎంసిలు. అయితే ఇందులో జిల్లాకు ఇప్పటి వరకు వచ్చిన నీళ్లు 13 టిఎంసిలు మాత్రమే. ఐదుసార్లు గేట్లు ఎత్తి దిగువకు నీళ్లు వదిలినా కూడా అనంతపురం జిల్లాకు అదనంగా ఒక్క చుక్క నీళ్లు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో జిల్లాలోనున్న ప్రధాన ప్రాజెక్టులు పిఎబిఆర్, మిడ్‌పెన్నార్‌లో నామమాత్రంగానే నీళ్లు ఉన్నాయి. పిఎబిఆర్‌లో రెండు టిఎంసిలు, మిడ్‌పెన్నారలో రెండు టిఎంసిల్లోపే నీళ్లు ఉన్నాయి. వృధాగా నీళ్లు నదిలో పోతున్న సమయంలోనూ అదనంగా జిల్లాకు నీళ్లు తీసుకోలేని దయనీయ స్థితి ఉంది. కనీసం తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ప్రవాహ సామర్థ్యం మేరకు కూడా నీళ్లు జిల్లాకు తీసుకోలేకపోతున్నాయి. దీని ప్రవాహ సామర్థ్యం 2400 క్యూసెక్కులైతే 1800 క్యూసెక్కులకు మించి జిల్లాకు నీళ్లు తీసుకోలేకపోతున్నాం. దీనికి ప్రధాన కారణంగా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ నిర్వహణ లోపాలే. ఆధునీకరణను 2008లో చేపడితే ఇప్పటికీ పూర్తవలేదు. కాలువ గట్లు బలహీనంగా ఉండటంతో గండ్లు పడతాయన్న ఉద్దేశంతో పూర్తి సామర్థ్యంతో నీళ్లు తీసుకోలేకపోతున్నాం. ఇక హంద్రీనీవా పరిస్థితి అదే రకంగా ఉంది. శ్రీశైలం డ్యామ్‌లో పుష్కలంగా నీరున్నా ప్రవాహ సామర్థ్యం లేనందున నామమాత్రంగానే నీళ్లు వస్తున్నాయి. అనంతపురం జిల్లాలో 304 చెరువులున్నాయి. వీటిల్లో ఇప్పటి వరకు పూర్తి సామర్థ్యంతో నిండినవి 34 మాత్రమే ఉన్నాయి. 171 చెరువుల్లో ఒక చుక్కనీరు లేదు. తక్కిన వాటిల్లో అరకొరగా నీళ్లు ఉన్నాయి. నీళ్లు వచ్చిన వెంటనే ఎక్కడివక్కడ తెగిపోతున్నాయి. అదే ఈనెలలో సత్యసాయి జిల్లా కనగానపల్లిలో వర్షాలు అధికంగా పడితే నీళ్లు దిగవకు వచ్చి బండమీదపల్లి చెరువు తెగింది. ఈ చెరువు తెగిన ప్రభావంతో అనంతపురం నగరంలోని పండమేరు వంక ఉధృతంగా ప్రవహించి కాలనీలను ముంచేసింది. ఇదే కాకుండా బొమ్మనహళ్, కణేకల్, గుమ్మగట్ట మండలాల్లోనే చెరువులకు గండ్లుపడిన దాఖలాలున్నాయి. ఇలా చెరువుల్లో నీళ్లు నిలుపుకోలేని పరిస్థితులున్నాయి. ఈ సమస్యలపైనే సిపిఎం గత వారంలో బస్సు యాత్ర చేపట్టి ఈ వారంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా కూడా నిర్వహించింది. వివిధ ప్రజా సంఘాలు, మేధావులు కూడా అనంతపురం జిల్లా సాగునీటి సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచిస్తున్నాయి. అయినా పాలకుల్లో కదలిక కనిపించడం లేదు. ప్రధాన రాజకీయపార్టీలేవి ఈ సమస్యలపై దృష్టి సారిస్తున్న దాఖలాలు కూడా కనిపించకపోవడం గమనార్హం. నష్టం జరిగితే పరిశీలించడం మినహా శాశ్వత పరిష్కార మార్గాలపై దృష్టి పెట్టడం లేదన్న విమర్శలున్నాయి.

నేరాలు ఘోరాలు

బావిలో పడి ఉపాధ్యాయుడు మృతి

కళ్యాణదుర్గం : పట్టణంలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు గోవిందరాజులు (50) ప్రమాదవశాత్తు బావిలో పడి శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాల మేరకు.. గోవిందరాజులు శెట్టూరు ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఈనేపథ్యంలో పట్టణ సమీపంలో ఉన్న వెంకటరమణప్ప తోటలో ధ్యానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి మృతి చెందాడు. మృతునికి భార్య వెంకటరమణమ్మ, కుమారుడు వినయ్‌కుమార్, కుమార్తె కీర్తి ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పట్టణ సిఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు.



మృతిచెందిన గోవిందరాజులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

గుత్తి : పట్టణంలోని అనంతపురం రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. సిఐ బి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె.సురేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని మాతృశ్రీ ఆసుపత్రి సమీపంలో 44వ జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి (55)ని కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రగాయాలతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. చెడ్డీ (డ్రాయర్) మాత్రమే ధరించిన అతడు భిక్షటన చేస్తూ జీవన కొనసాగించేవాడని అనుమానం వ్యక్తం చేశారు. అతని ఆచూకీ తెలిస్తే సెల్..9346010582, 9346917089 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

అంధుల జంటకు వివాహ కానుక

అనంతపురం : సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఒకటైన అంధుల ఆదర్శ జంటకు కలెక్టర్ వినోద్‌కుమార్ వివాహ కానుక అందజేశారు. ఈమేరకు శనివారం నగరంలోని కలెక్టరేట్‌లో ఉన్న తన ఛాంబర్‌లో రూ.25వేల చెక్కును అంధ లోకేష్, సునీత దంపతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయిట్రస్టు సభ్యులు రాఘవేంద్ర పాల్గొన్నారు.

హెచ్చెల్సీలో కంపచెట్ల తొలగింపు

పుట్లూరు : మండల పరిధిలోని సుబ్బరాయసాగర్ నుంచి పుట్లూరుతోపాటు కోమటికుంట్ల, జిసి.పల్లి చెరువులకు నీరు అందించే హెచ్చెల్సీలో పేరుకుపోయిన కంపచెట్లను శనివారం జెసిబి ద్వారా తొలగింపు చర్యలు చేపట్టారు. మండల టిడిపి నాయకుడు పుట్లూరు పుల్లారెడ్డి ఆధ్వర్యంలో హెచ్చెల్సీని శుభ్రం చేస్తున్నారు. తద్వారా హెచ్చెల్సీలో నీరు సక్రమంగా వెళ్తుంగని ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

ఉరవకొండ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని ఎఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిద్ధార్థ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సుదూరు ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి వచ్చే విద్యార్థులు మధ్యాహ్నం ఆకలితో అలమటించాల్సి వస్తోందన్నారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేపట్టిన యువగళం పాదయాత్రలో తాము అధికారంలోకి వస్తే ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కావున వెంటనే జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులను కలుపుకుని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

బొమ్మనహాల్ : మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి కుంకుమార్చన చేసి సువర్ణ కిరీటం, వెండి కవచాన్ని అలంకరించారు. భక్తులకు సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ అధికారి నరసింహారెడ్డి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయదుర్గం : పట్టణంలో ఆదివారం ఉదయం 7:30 నుంచి 8:30 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్ బాలచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమణించి సహకరించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పామిడి : సమస్యలు పరిష్కరించాలని ఎన్‌టిఆర్ వైద్యసేవా పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ సిబ్బంది కోరారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారి శివకార్తీక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమానపనికి సమాన వేతనం అమలు చేయాలని, ట్రస్ట్ ఫీల్డ్ సిబ్బందికి నిర్వహించిన వన్ టైం ఎగ్జామ్‌ను ఉపసంహరించుకోవాలని, అంతర్గత ప్రమోషన్లు కల్పించాలని, చనిపోయిన సిబ్బందికి రూ.15లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, రిటైర్ అయిన వారికి రూ.10లక్షలు గ్రాట్యుటీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బంది అమర్నాథ్‌రెడ్డి, అనురాధ పాల్గొన్నారు.

28న కౌన్సిల్ సమావేశం

గుత్తి : మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు కమిషనర్ బి.జబ్బర్‌మియా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయంలోని సభా మందిరంలో జరిగే సమావేశానికి పురపాలక సంఘం పాలకవర్గం సభ్యులు, మున్సిపల్ విభాగాల అధికారులు హాజరు కావాలని కోరారు.

సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత

పామిడి : పట్టణంలోని 13, 14వ వార్డులకు సంబంధించిన బాధితులకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ శనివారం పట్టణంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




టిడిపి సభ్యత్వ నమోదులో పాల్గొన్న అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి, తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి



నార్పల మండలంలో టిడిపి సభ్యత్వాన్ని అందజేస్తున్న నాయకులు

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నెల రోజుల్లో లక్ష మందితో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు చేయిస్తామని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. శనివారం నగరంలోని 29వ డివిజన్ సాయినగర్‌లో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా అనంతపురం నగరాన్ని తీసుకున్నారన్నారు. 10 రోజుల క్రితమే ఇక్కడ సభ్యత్వం నమోదు ప్రారంభమైందన్నారు. ఇప్పటికే పదివేల మంది సభ్యత్వం తీసుకున్నారన్నారు. నారా లోకేష్ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు.

తాడిపత్రి : టిడిపి సభ్యత్వ కార్యకర్తకు తొలిమెట్టు అని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో నియోజకవర్గానికి సంబంధించి టిడిపి సభ్యత్వ నమోదును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి అండగా ఉంటున్న కార్యకర్తలతోపాటు కుటుంబ సభ్యులకు సభ్యత్వం భరోసా ఉంటుందన్నారు. సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల ప్రమాద బీమా, సాధారణ మరణానికి రూ.10వేలు మట్టి ఖర్చులతోపాటు విద్య, వైద్య, ఉపాధి సాయం అందించనున్నట్లు తెలిపారు.

రాయదుర్గం : పట్టణంలోని 30వవార్డులో పార్టీ ఇన్‌ఛార్జి బలేశంకర్ ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు మాట్లాడుతూ సభ్యత నమోదు విజయవంతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రతినిధులు యల్లప్ప, రాజశేఖర్, వెంకటేశులు, తిప్పేస్వామి పాల్గొన్నారు.

పుట్లూరు : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు మండలంలోని కడవకల్లు గ్రామంలో టిడిపి నాయకులు సభ్యత్వ నమోదు చేపట్టారు. ఇందులో భాగంగా నాయకులు, కార్యకర్తలు టిడిపి సభ్యత్వ నమోదును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, మండల కన్వీనర్ బాలరంగయ్య, నాయకులు బాబు, శివశంకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, సతీస్, రామాంజినేయులు, శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్‌నాయుడు, నాగేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్‌రాజు, పెద్దిరాజు, సత్యంరెడ్డి, కిట్టయ్య, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని గూగూడు గ్రామంలో శనివారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమమే టిడిపి ధ్యేయమన్నారు. ఇందుకోసం టిడిపి సభ్యత్వ నమోదు తీసుకునే కార్యకర్తలకు పార్టీ అనేక సౌలభ్యాలు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ గుర్రప్పనాయుడు, నాయకులు బండారు లీలావతి, ఆలం వెంకట నరసానాయుడు, సాయి, మండల కన్వీనర్ ఎర్రనాగప్ప, ప్రతాప్‌చౌదరి, పిట్టు రంగారెడ్డి, వెంకటేశ్వరనాయుడు, మాజీ జడ్పిటిసి జాఫర్‌వలి, రాజన్న, తదితరులు పాల్గొన్నారు..

బ్రహ్మసముద్రం : కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా టిడిపి పని చేస్తుందని ఆ పార్టీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు తెలిపారు. శనివారం మండల పరిధిలోని గొంచిరెడ్డిపల్లి గ్రామంలో టిడిపి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మంజుల వన్నూరుస్వామి, క్లస్టర్1-ఇన్‌ఛార్జి అంకే ఓబులేసు, డీలర్ బోయ లక్ష్మన్న, నాయకులు గోవిందు, వెంకటేష్, రామప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో టిడిపి బలోపేతానికి పాటుపడుదామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు, టిడిపి గుత్తి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణ, మండల,పట్టణ కన్వీనర్లు బర్దివలి,ఎంకె.చౌదరి పిలుపునిచ్చారు. మండలంలోని కె.ఉబిచెర్ల గ్రామంలో శనివారం టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. గ్రామంలో మహిళలతో పాటు పలువురు టిడిపి సభ్యత్వం తీసుకున్నారు. పేదవారి సభ్యత్వానికి రూ.10వేలు చెల్లిస్తానని గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు రామచంద్ర ప్రకటించారు. అనంతరం గ్రామంలో ఇటీవల ప్రమాదానికి గురైన టిడిపి కార్యకర్తకు గుమ్మనూరు నారాయణ రూ. 10వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చికెన్ శీనా,బి.రమేష్, తిమ్మప్ప,రంగడు, సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

కల్వర్టు పనులను వేగవంతం చేయాలి



కల్వర్ పనులను పరిశీలిస్తున్న నాయకులు

బ్రహ్మసముద్రం : జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.18 లక్షలతో నిర్మిస్తున్న మండల పరిధిలోని సూగేపల్లి కల్వర్టు పనులను వేగవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు సూచించారు. శనివారం సూగేపల్లి కల్వర్టు నిర్మాణ పనులను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన పనులను పూర్తి చేసి రాకపోకలను పునరుద్ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వనిత మల్లికార్జున, మాజీ ఎంపిపి భర్త వన్నూరుస్వామి, క్లస్టర్ ఇన్‌ఛార్జి అంకే ఓబులేసు, నాయకులు పెంకులు మల్లికార్జున, మాజీ ఎంపిటిసి కరేగౌడ, స్కూల్ కమిటీ ఛైర్మన్ కరేగౌడ, అక్కన్న, దండు తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



కందిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం : శింగనమల మండల పరిధిలోని నాయనవారిపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన పంటలను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా కందిపంటలో గూడు కట్టే పురుగు ఉధృతి గుర్తించి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్ సూచించారు. జిల్లావ్యాప్తంగా కందిపంట పూత దశలో ఉండటం వల్ల గూడు కట్టే పురుగు (మారుకా మచ్చల పురుగు) వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ముందస్తుగా ఇమామెట్టిన్ బెంజోయేట్ అనే పురుగు మందును ఎకరానికు వంద గ్రాముల చొప్పున వాడుకోవాలని తెలిపారు. అనంతరం హార్టికల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ త్రికల మాధవి చీనీపంటలను పరిశీలించారు. ఎరువుల యాజమాన్యం, ఎగిరే పేను పురుగు, నల్లి పురుగుల యాజమాన్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, సిబ్బంది ముత్యాలరావు పాల్గొన్నారు.

నూతిమడుగు బ్రిడ్జిని నాలుగు నెలల్లో పూర్తి చేస్తాం

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

నూతిమడుగు సమీపంలోని పెన్నానదిపై ఉన్న బ్రిడ్జిని నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. వర్షాలకు కూలిన నూతిమడుగు బ్రిడ్జిని ఎమ్మెల్యే అమిలినేని ఆర్‌అండ్‌బి అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పేరూరు జలాశయం గేట్లు ఎత్తిన సమయంలో పెన్నానదిపై ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోతే ఇక్కడ ప్రాతినిధ్యం వహించిన మంత్రి ఉషశ్రీచరణ్ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కనీసం అటువైపు కూడా చూసిన పాపాన పోలేదన్నారు. బ్రిడ్జి కూలిపోవడంతో పరిసర గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే బ్రిడ్జి నిర్మాణానికి ఎంత నిధులు అవసరమో ఎస్టిమేషన్లు వేసి సంబంధిత శాఖ అధికారులకు అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఏదిఏమైనా మూడు, నాలుగు నెలల్లో బ్రిడ్జి నిర్మించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని భరోసా ఇచ్చారు.

గొడ్డుమర్రిలో కార్డెన్‌సెర్చ్

యల్లనూరు : ఎస్పీ జగదీశ్ ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని గొడ్డుమర్రిలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా అనుమానితుల ఇళ్లు, గడ్డివాములను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ సత్యబాబు, పుట్లూరు ఎస్ఐ హేమాద్రి, ఎఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, పోలీసులు శంకర్ నారాయణ, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోవిందప్ప మృతి పార్టీకి తీరని లోటు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

పూజారి గోవిందప్ప మృతి పార్టీకి తీరని లోటు అని టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు అన్నారు. శనివారం మండల పరిధిలోని గొంచిరెడ్డిపల్లి గ్రామంలో మృతిచెందిన గోవిందప్ప (67) మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపిపి మంజుల వన్నూరుస్వామి, డీలర్ లక్ష్మన్న, బోయ గోవిందు, హరిజన వెంకటేశులు, బోయ నాగరాజు, బోయ గోవిందప్ప, మజ్జిగ రామన్న, బోయ మల్లికార్జున, బోయ నగేష్, జెసిబి ఎర్రిస్వామి, తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న టిడిపి మండల కన్వీనర్ శ్రీరాములు